ప్రజాశక్తి
బుధవారం 16 నవంబరు 2022
5
శ్రీకాకుళం



ఇంటర్ విద్యార్థులకు ధ్రువపత్రాల జారీ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో మే, ఆగస్టులో నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికేట్లను ఇంటర్ బోర్డు జారీ చేసిందని ఆర్ఐఒ ఎస్.తవిటినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్‌లో ఉత్తీర్ణులైన ద్వితీయ సంవత్సర విద్యార్థులు (జనరల్ స్ట్రీమ్) 14,764 మంది ఉన్నారని, కంపార్ట్‌మెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు 3,419 మంది ఉన్నారని పేర్కొన్నారు. వృత్తి విద్యలో రెగ్యులర్ 1161 మంది, కంపార్ట్‌మెంట్‌లో 409 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికేట్లను ఆర్ఐఒ కార్యాలయంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ స్వయంగా గానీ, అధీకృత వ్యక్తి గానీ తీసుకుని విద్యార్థులకు పంపిణీ చేయాలని సూచించారు. కళాశాల యాజమాన్యాలు తమ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసే బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు.

షట్టర్ల సమస్య కొలిక్కి వచ్చేదెప్పుడో?

- 2009లో షట్టర్ల కొనుగోలులో అవినీతిపై సిఐడి కేసు
- కొత్తవి ఏర్పాటుకు కేసులు అడ్డంకి
- పలుచోట్ల శిథిలావస్థకు చేరిన షట్టర్లు
- ప్రస్తుత ఖరీఫ్‌లో 20 వేల ఎకరాలపై ప్రభావం

జిల్లాలో పంట సాగంతా ఒకలా ఉంటే టెక్కలి, పలాస నియోజకవర్గాల్లో మరోలా ఉంది. వంశధారలో నీరు సమృద్ధిగా ఉన్నా, ఆ ప్రాంతాలకు ఈ ఏడాది నీరు చేరలేదు. అక్టోబరులో కురిసిన వర్షాలు పంటలకు కాస్త ఉపయోగపడినా, కీలకమైన పొట్ట దశలో నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా షట్టర్లు శిథిలావస్థకు చేరుకోవడంతో, ఈసారీ శివారు భూములకు నీరందలేదు. షట్టర్ల కొనుగోళ్లలో అవినీతిపై 2009లో సిఐడి కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. విచారణ పెండింగ్‌లో ఉండడంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో కొత్తగా షట్టర్లు ఏర్పాటు చేసుకోలేక, పాడైన వాటితోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వేలాది ఎకరాలపై ప్రభావం చూపింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



కోటబొమ్మాళి ప్రాంతంలో ఎడమ కాలువపై ఏర్పాటు చేసిన షట్టర్ల దుస్థితి (ఫైల్)

నరసన్నపేట వంశధార ఇంజినీరింగ్ అధికారులు 2009లో కొనుగోలు చేసిన షట్టర్లలో బయటపడిన అవినీతి సాగు రంగానికి శాపంగా మారింది. అధిక ధరకు కొనుగోలు చేశారన్న ఆరోపణలపై సిఐడి రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. ఇప్పటికీ ఆ కేసు కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. 12 ఏళ్లు గడిచినా కేసు తేలకపోవడంతో కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కార్యాలయాల్లో సుమారు రూ.నాలుగు కోట్ల నుంచి రూ.ఐదు కోట్ల విలువ చేసే షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పాడైపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. వీటిని వేలం వేసి కొత్తగా కొనుగోలు చేయాల్సి ఉంది. అలా చేయాలంటే ప్రభుత్వం కేసుకు సాధ్యమైనంత తొందరగా ముగింపు పలకాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు కొంతమంది జైలుకెళ్లారు. ఒకరిద్దరు మరణించారనీ అధికారులు చెప్తున్నారు. కేసు పెండింగ్‌లోనే ఉండడం వల్ల శివారు భూములకు సాగునీటి సమస్య పునరావృతమవుతూనే ఉంటుందని పలువురు ఇంజినీరింగ్ అధికారులు చెప్తున్నారు.

20 వేల ఎకరాలపై ప్రభావం

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. దాదాపుగా అన్నిచోట్లా షట్టర్లు శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని చోట్ల కొత్తగా షట్టర్లను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలూ పెండింగ్‌లోనే ఉండిపోయాయి. సాగునీటి ప్రవాహంపై నియంత్రణ లేకపోవడంతో ఎడమ కాలువకు సంబంధించి టెక్కలి, పలాస నియోజకవర్గాల్లో ఈ ఏడాది సరిగ్గా నీరందలేదు. వర్షాల కోసం రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కీలకమైన పొట్ట దశలో నీరు లేకపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు నియోజకవర్గాల్లో సుమారు 20 వేల ఎకరాలపై ప్రభావం ఉండవచ్చని తెలుస్తోంది.

సాఫీగా సాగని సాగునీటి ప్రవాహం

వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా, కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో 1800 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా, 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కాలువల ఆధునీకరణ జరగకపోవడంతో గట్లు బలహీనంగా ఉన్నాయి. కాలువల్లో గుర్రపుడెక్క, పూడికతీత బాగా పేరుకుపోవడంతో సాగునీటి ప్రవాహం సక్రమంగా సాగడం లేదు. కాలువల్లోకి విడిచిపెడుతున్న నీరు సామర్థ్యం కంటే తక్కువగా ఉండడం, మరో షట్టర్లు లేకపోవడంతో సాగునీటి ప్రవాహం సాఫీగా సాగడం లేదు. షట్టర్ల అవినీతిపై ఉన్న కేసుకు ప్రభుత్వం సత్వరమే ముగింపు పలకాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం



షట్టర్ల సమస్య అంశాన్ని ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లాం. జిల్లాస్థాయిలో పలు సందర్భాల్లో నిర్వహించిన సమావేశాల్లోనూ ప్రస్తావించాం. చాలాచోట్ల షట్టర్లు పాడైపోయాయి. షట్టర్ల కేసు తేలితే కొత్తవి అమర్చుకోవడానికి అవకాశం ఉంటుంది. శివారు భూములకు సాగునీటి సమస్యలు తలెత్తవు.

- డోల తిరుమలరావు, ఎస్ఇ, జలవనరులశాఖ

ధాన్యానికి మద్దతు ధర ప్రకటించాలి

- క్వింటాకు రూ.2,800 ఇవ్వాలి
- దోమపోటుతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు



మాట్లాడుతున్న గోవిందరావు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రాష్ట్ర ప్రభుత్వం క్వింటా ధాన్యానికి రూ.2,800 మద్దతు ధర ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.షణ్ముఖరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేరళలోని వామపక్ష ప్రభుత్వం క్వింటా ధాన్యానికి రూ.2,800 ప్రకటించిందని తెలిపారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఎరువులు, పురుగుల మందులు ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని తెలిపారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సుమారు లక్ష ఎకరాలకు పైగా దోమపోటు వల్ల పంట నష్టపోయిందని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కోటబొమ్మాళి మండలంలో అధికారుల లెక్కలు ప్రకారం 18 వేల ఎకరాల్లో ఉబాలు కాగా, అందులో 900 ఎకరాలు పూర్తిగా, రెండు వేల ఎకరాలు పాక్షికంగా పంట నష్టం వాటిల్లిందన్నారు. వాస్తవంగా అంతకంటే ఎక్కువగా నష్టం వాటిల్లిందని తెలిపారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని లేకుంటే ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు హెచ్.ఈశ్వరరావు, గొండు నీలన్న, సిహెచ్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సిఎం సభాస్థలి పరిశీలన

ప్రజాశక్తి - నరసన్నపేట

ఈనెల 25వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో నరసన్నపేట నియోజకవర్గంలో పలుచోట్ల సభాస్థలిని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక మంగళవారం పరిశీలించారు. జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష రెండో విడత రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని సిఎం ఇక్కడ నుంచి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో పర్యటనా ఏర్పాట్లపై జిల్లా ముఖ్య యంత్రాంగంతో చర్చించారు. నరసన్నపేట కళాశాల మైదానం, తామరపల్లి, గుండువిల్లిపేట, ఈదులవలసలో పలుచోట్ల స్థలాలను పరిశీలించారు. సిఎంకు ప్రాథమిక సమాచారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వైసిపి నాయకులు చింతు రామారావు, ముద్దాడ భైరాగినాయుడు, రాజాపు అప్పన్న, తదితరులున్నారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న కృష్ణదాస్, కలెక్టర్, ఎస్‌పి

విశాఖపై విష ప్రచారం ఎందుకు?

- పవన్‌వి దిగజారుడు రాజకీయాలు
- వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట

రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా విశాఖపట్నంను పాలనా రాజధానిగా చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్తే విపక్షాలు విశాఖపై విషం చిమ్ముతున్నాయని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. నరసన్నపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధానికి అవసరమైన అన్ని వనరులు, అర్హతలు రాష్ట్రంలో విశాఖపట్నానికే ఉన్నాయన్నారు. ఒకవైపు గిరిజన ప్రాంతం, మరోవైపు సముద్రతీరం, మధ్యలో మైదాన ప్రాంతం ఇలా భౌగోళికంగా అన్ని సహజ వనరులు విశాఖకు ఉన్నాయని అన్నారు. టిడిపి హయాంలో అమరావతిలో చేసినవి తాత్కాలిక నిర్మాణాలేనని చెప్పారు. పచ్చని పంటలు పండే భూములను కాజేయడానికే చంద్రబాబు అమరావతి రాజధాని అని నాటకాలు ఆడారని విమర్శించారు. అక్కడ కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యవహారాలు తప్ప రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు సంబంధించి ఏమీ జరగలేదన్నారు. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాభివృద్ధి అంటే అమరావతి మాత్రమే అనేలా కలరింగ్ ఇచ్చిన చంద్రబాబుకు పవన్ కళ్యాణ్ వంతపాడుతూ అనాలోచిత వ్యాఖ్యలు చేస్తుండడం సబబు కాదన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో ఇళ్లు లేని పేదలను చూసి వారికి సొంత ఇళ్లు ఇస్తామని జగన్ వాగ్దానం చేశారని తెలిపారు. గెలిచిన వెంటనే రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు మూడు విడతల్లో ఇళ్లను ఇస్తున్నారని చెప్పారు. తొలివిడతలో రూపు దిద్దుకుంటున్న ఇళ్లన్నీ దాదాపుగా పూర్తయిన స్థితిలో ఉంటే, వాటిపై పవన్ రాజకీయాలు చేయాలని చూస్తే లబ్ధిదారులే తిప్పికొట్టారన్నారు. ఇప్పుడు తయారవుతున్నవి కేవలం జగనన్న కాలనీలు కావని, ఏకంగా గ్రామాలే రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. పవన్ కళ్యాణ్ రాజకీయాలు అతనికే అంతుపట్టని రీతిలో కొనసాగుతున్నాయని విమర్శించారు. బిజెపితో పొత్తు పెట్టుకుని చంద్రబాబుని గెలిపించడానికి ఆయన పడుతున్న తాపత్రయం దిగజారుడు రాజకీయాలకు సంకేతమన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తే విపక్షాలు ఎందుకు కుళ్లుకుంటున్నాయో అర్థం కావడం లేదన్నారు. సమావేశంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, సుడా చైర్‌పర్సన్ ప్రతినిధి కోరాడ చంద్రభూషణ్ గుప్త, చింతు రామారావు, ముద్దాడ భైరాగి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

లాభాపేక్ష లేకుండా సేవలు

శ్రీకాకుళం అర్బన్ : రైతుల ప్రయోజనాలను కాపాడడంతో పాటు లాభాపేక్ష లేని వ్యాపారాన్ని ప్రజలకు అందించడంలో డిసిఎంఎస్ ముందడుగు వేస్తోందని ఆ సంస్థ చైర్‌పర్సన్ చల్లా సుగుణమ్మ అన్నారు. 69వ అఖిల భారత సహకార వారోత్సవాలను డిసిఎంఎస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. జాతీయ పతాక ఆవిష్కరణ, ప్రతిజ్ఞ అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో డిసిఎంఎస్ అభివృద్ధికి గతంలో పనిచేసిన పాలకవర్గాల ముందుచూపు ఎంతగానో దోహదపడిందన్నారు. అందువల్లే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో డిసిఎంఎస్ ఆర్థిక వనరులు కలిగి ఉందన్నారు. రానున్న రోజుల్లో వాటిని కాపాడడంతో పాటు పెంచేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా సహకార అధికారి ఎస్.సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, డివిజనల్ సహకార అధికారి కె.దామోదరరావు, ఎం.రమేష్‌బాబు, శ్రీకాకుళం సబ్ డివిజనల్ అధికారి ఎస్.భూషణరావు, డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ పి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ వేయడానికి ఇబ్బంది ఏమిటి?

సచివాలయ సిబ్బందిని ప్రశ్నించిన జెసి



లింగాలవలస సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జెసి నవీన్

ప్రజాశక్తి - జలుమూరు

బయోమెట్రిక్ వేయడానికి వచ్చిన ఇబ్బంది ఏమిటని సచివాలయ సిబ్బందిని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ప్రశ్నించారు. మండలంలోని చల్లవానిపేట, జలుమూరు, లింగాలవలస సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. లింగాలవలస సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్ మధ్యాహ్నం ఒంటి గంట వరకు బయోమెట్రిక్ వేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇంతవరకు బయోమెట్రిక్ ఎందుకు వేయలేదని వారిని ప్రశ్నించారు. విధుల్లో భాగంగా బయటకు వెళ్లానని పంచాయతీ కార్యదర్శి, ఇంటర్నెట్ పనిచేయలేదని మహిళా పోలీస్ బదులిచ్చారు. బయోమెట్రిక్ వేసి బయటకు వెళ్లి గానీ, వేయకుండా ఎలా వెళ్తారని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. మిగిలిన అందరికీ పనిచేసిన ఇంటర్నెట్, మీకు మాత్రమే పనిచేయలేదా అని మహిళా పోలీస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 10.30 గంటల్లోపు సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ వేయాలని స్పష్టం చేశారు. అలా వేసిన తర్వాతనే విధి నిర్వహణలో భాగంగా బయటకు వెళ్లాలని ఆదేశించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వన్ బి, అడంగల్ తదితర సేవలతో పాటు లామినేషన్, రైల్వే టికెట్లు కూడా సచివాలయాల ద్వారా చేయాలన్నారు. దీనిపై ముందుగా వాలంటీర్లకు అవగాహన కల్పించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహనా సదస్సులు

రైతుకు, మిల్లరుకు కనెక్షన్ ఉండకూడదని జెసి అన్నారు. ధాన్యం కొనుగోలు సిబ్బంది అన్ని పరీక్షలు చేసి ధాన్యం పంపించాక మిల్లర్లు తీసుకోమనే ప్రసక్తే ఉండకూడదన్నారు. ధాన్యం కొనుగోలు విధానంపై సిబ్బందికి పలు ప్రశ్నలు వేశారు. పూర్తిస్థాయిలో సిబ్బందికి అవగాహన లేదని, ఎస్ఒపి ప్రకారం ధాన్యం కొనుగోలు ప్రక్రియ అర్థమయ్యేలా వివరించాలని తహశీల్దార్ బి.సత్యంకు సూచించారు. ధాన్యం కొనుగోలులో భాగస్వామ్యమయ్యే ప్రతిఒక్కరికీ వారి విధులపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. గ్రామాల్లోని రైతులకు ధాన్యం కొనుగోలు విధానంపై అవగాహన కల్పించాలని వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామకంఠం భూముల 'సమిత్వ' స్కీమ్ అమలు వివరాలను ఎంపిడిఒ జి.వి రవికుమార్, పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డిఎం పి.జయంతి, సిఎస్‌డిటి పి.గణేష్, విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఎంఎంసిల ద్వారా రైతులకు విస్తృత సేవలు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

మార్కెట్ కమిటీల ద్వారా రైతులకు విస్తృత సేవలను అందించాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సూచించారు. పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాడాన సునీల్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సంబంధించిన వ్యవసాయ ఉత్పత్తులను భద్రపరుచుకునేందుకు అనువుగా గిడ్డంగులకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. పాడిరైతుల సంక్షేమానికి ఉచిత పశువైద్య శిబిరాలను ఎఎంసిల ద్వారా నిర్వహించడం వల్ల ప్రయోజనం కలుగుతుందన్నారు. మండలానికి ఒకటి చొప్పున మినీ రైతుబజార్లు నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. 20వేల మెట్రిక్ టన్నుల నిల్వ ఉంచుకునేలా కొత్త గోదాముల నిర్మాణానికి తీర్మానం చేయాలని సూచించారు.

ప్రగతిపథంలో ప్రభుత్వ విద్యాసంస్థలు

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలు ప్రగతి పథంలో నడుస్తున్నాయని స్పీకర్ అన్నారు. పొందూరు మేజర్ పంచాయతీ పరిధిలోని ఎరుకులపేటలో రూ.12 లక్షలతో మనబడి నాడు-నేడు ఆధునీకరణ పనులకు, జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.23లక్షలు, ఎరుకుల కాలనీలో రూ.24.92 లక్షలతో ఇంటింటా మంచినీటి కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నేలా ప్రభుత్వ విద్యాసంస్థల రూపురేఖలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మార్చివేశారని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని అందజేయడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమాల్లో జెడ్‌పిటిసి ఎల్.కాంతారావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగడి లక్ష్మి, ఎఎంసి వైస్ చైర్మన్ జె.వెంకటరావు, ఎంఇఒ పి.వి రామరాజు, ఎపిఎం జి.శ్యామలరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చైతన్య, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు కె.సూర్యారావు, వీరాస్వామి, ఎఎంసి డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

టెక్కలి రూరల్ : ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. క్లాత్ సంచులను వాడాలన్నారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఇందిరాగాంధీ కూడలి వరకు మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో తహశీల్దార్ బెండి గిరిబాబు, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి, ఇఒ బొడ్డేపల్లి రామారావు, సర్పంచ్ జి.సుజాత, విద్యార్థులు, పోలీసులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా 'ఉపాధి' పనులు



పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి - లావేరు

పని ప్రదేశాల్లో సమయపాలన పాటించడం ద్వారా గరిష్ట కూలి పొందవచ్చని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు ఉపాధి హామీ కూలీలకు సూచించారు. మండలంలోని పెద్దరావుపల్లి, లక్ష్మీపురంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలు, ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ కనీసం ఆరు గంటలు పనిచేయడం ద్వారా రోజుకు రూ.250 పైబడి కూలిని పొందవచ్చని చెప్పారు. నిర్దేశించిన కొలతల మేరకు పనులు చేయాలని సిబ్బందికి సూచించారు. గరిష్ట కూలి పొందేందుకు గానూ ఎంతమేర పనిచేయాలన్న అంశంపై సిబ్బంది కూలీలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. చేపట్టిన పనులు గ్రామానికి, ప్రజలకు ఉపయుక్తంగా ఉండేలా కూలీలు, సిబ్బంది సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పనుల్లో నాణ్యతకు, పారదర్శకతకు పెద్దపీట వేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎపిఒ సత్యవతి, ఇసి లెనిన్‌బాబు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ఉచిత నర్సింగ్ శిక్షణతో ఉపాధి



ఆప్రాన్, మెటీరియల్‌ను అందిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు శ్రీకాకుళం నగరంలో ఉచిత వసతితో కూడిన నర్సింగ్ శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడం శుభ పరిణామమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. నగరంలోని రెడ్డీస్ ఫౌండేషన్ శిక్షణా కేంద్రంలో 70 మంది అభ్యర్థులకు ఆప్రాన్స్, ట్రైనింగ్ మెటీరియల్స్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణా కేంద్రంలో అత్యాధునిక సదుపాయాలతో కూడిన ల్యాబ్, డిజిటల్ తరగతి గదులు వంటి సౌకర్యాలు ఉన్నాయని, వాటిని యువత వినియోగించుకోవాలని సూచించారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా రణస్థలం మండలంలోని పాతర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కార్పొరేట్ ఆస్పత్రి స్థాయిలో అభివృద్ధి చేశారని, అత్యాధునిక ల్యాబ్, ఆస్పత్రి పరికరాలను పరికరాలను అందించడం వల్ల ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బద్దెల సురేష్ మాట్లాడుతూ నిరుపేద యువతకు నైపుణ్యం కలిగిన శిక్షకులతో సాంకేతిక, సాఫ్ట్ స్కిల్, ఆన్ జాబ్ ట్రైనింగ్ ఇచ్చామన్నారు. విశాఖపట్నం, హైదరాబాద్ వంటి పెద్ద నగరాల్లో పలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో 56 మందికి ఉపాధి కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సిబ్బంది నాగమణి, అనిల్ కుమార్ వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకు వితరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎచ్చెర్లలో తాగునీటి కోసం జనం పడుతున్న ఇబ్బందులపై ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు స్పందించారు. తన సొంత నిధులతో రక్షిత మంచి నీటి ట్యాంకును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెప్పడంతో ట్యాంకును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. తాగునీటి సమస్యను గుర్తించి తమకు నీటి ట్యాంకు ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాము, దుంప రమణ తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి ట్యాంకును ప్రారంభిస్తున్న సూర శ్రీనివాసరావు



సంగీత కళాకారులతో రామారావు

కళలకు నిలయం ఉద్దానం

కవిటి: కళలకు, కళాకారులకు ఉద్దాన ప్రాంతం నిలయమని ఎపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ నర్తు రామారావు అన్నారు. మండలంలోని బొరివంకలో ఉద్దాన యూత్ క్లబ్ ఆధ్వర్యాన కవిటి, ఇచ్ఛాపురం మండలాలకు చెందిన సంగీత కళాకారులతో మంగళవారం సంగీత కచేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కళాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా సంగీత గురువు తిప్పన దనుంజయరెడ్డి, చలపరాయి రవికుమార్, చలపరాయి వినోద్ కుమార్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం పటాన రహిత్యారెడ్డి, కాతిల రుక్మిణీ రెడ్డి, చలపరాయి చాణక్య, చలపరాయి అమృత, నర్తు భార్గవ్, జగన్ అచారి, బి.గౌతమ్‌లతో నిర్వహించిన చిన్నారుల సంగీత కచేరీ ఆహుతలను అలరించింది.ఎంపిటిసి దుద్ధి సతీష్‌కుమార్, ఎంపిటిసి మాజీ సభ్యులు బెందాళం విజయ్‌కృష్ణ, ఉద్దానం యూత్ క్లబ్ అధ్యక్షుడు లొట్ల దీనబంధు, బెందాలం మోహనరావు, భగీరథ దొలయి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

శ్రీకాకుళం అర్బన్ : విశాఖలోని ఇన్‌స్పైయిర్ స్కూల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి ఉమామహేశ్వరరావు, హారికలు ఉత్తమ ప్రతిభ కనబరచి ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవనంద్‌దత్తా విజేతలుగా నిలిచిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. చదువుతో పాటు కళలు, క్రీడలపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, టి.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

ఎన్‌జిఒ సభ్యత్వ నమోదుపై శ్రద్ధ

శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగులంతా ఎన్‌జిఒ సంఘంలో సభ్యులుగా చేరాలని రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాస్‌లతో కలిసి మంగళవారం పర్యటించారు. ఎపిఎంజిఒ సంఘం తాలూక యూనిట్ల ఎన్నికల నేపథ్యంలో సభ్యత్వ నమోదు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. ఉద్యోగులను కలిసి ఎన్నికల షెడ్యూల్ వివరిస్తూ, సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే ఎన్‌జిఒ సంఘం ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు. సంఘాన్ని బలోపేతం చేయడం ద్వారా రానున్న రోజుల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కలెక్టరేట్‌లోని పలు విభాగాలు, వివిధ కార్యాలయాలు, జిల్లా పరిషత్ ప్రాంగణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బొత్స శ్రీనివాస్, బడగల పూర్ణచంద్రరావు, సోమేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, నారాయణరావు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోని ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎన్‌జిఒ నాయకులు

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పుస్తక పఠనం అనేది మంచి అలవాటని, పుస్తకాల చదివి అత్యున్నతమైన స్థానాలకు పిల్లలు ఎదగాలని గ్రంథాలయ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ అన్నారు. నగరంలోని జిల్లా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాల వారోత్సవాలు సందర్భంగా మంగళవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పిల్లలకు కావాల్సిన అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని, ఇంకా మీకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో తీసుకొస్తామని తెలిపారు. లైబ్రరీలో చదవడం మాకిష్టం కార్యక్రమం, చిల్డ్రన్ క్లబ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. చిన్నారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతమైన శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ముఖ్య అతిథి, ఆడిట్ అధికారి సిహెచ్.ప్రభావతి మాట్లాడుతూ నేను ఒకప్పుడు ఇదే గ్రంథాలయంలో చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నానని గుర్తు చేశారు. పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవడం వల్ల చెడు ఆలోచనలకు దూరంగా ఉండవచ్చునని పేర్కొన్నారు. మంచి అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి దోహదపడతాయని తెలిపారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే వాళ్ల జీవితాలు చేతలారా వాళ్లే నాశనం చేసుకున్న వాళ్లవుతారని, ఇలాంటి విషయాలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ ప్రతినిధి సువారి సత్యనారాయణ, కార్యదర్శి బుర్రి కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, చాడాశ్రీనివాస్ మా స్టారు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పాఠ శాల విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సుమారుగా 40 మంది పిల్లలు ఈ పోటీలో పాల్గొన్నారు.

రణస్థలం : స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో జిల్లా పరిషత్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.రాజ్‌కిషోర్, సాయి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ రమేష్, గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి, బిసి హాస్టల్ వార్డెన్ మన్మథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు : మురపాక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో కెజిబివి పాఠశాల ప్రిన్సిపాల్ బల్లా సుధ పాల్గొన్నారు. ఈ మేరకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, రామాయణ మహాభారతాలు, బాల సాహిత్యం వంటి 400 పుస్తకాలు పుస్తక ప్రదర్శనలో ఉంచారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, కెజిబివి ఉపాధ్యాయులు పసుపుల లలిత, గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

జి.సిగడాం : జి.సిగడాం శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లంక, విఆర్ఒ నర్సింగరావు, ఆర్ఎఎస్ వినోద్, గ్రంథాలయాధికారి వై.అమర్నాథ, గ్రంథాలయ సిబ్బంది దుర్గారావు, ఎపి మోడల్ స్కూల్ లైబ్రేరియన్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

పోలాకి : పోలాకి శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో సంఘ సంస్కర్త పైల అప్పన్న, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్ కుమార్, గ్రంథాలయ అధికారి కె.మానస, పి.వరధరాజులు, కె.సిమ్మప్పడు, పివిఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

కవిటి: కవిటి శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో ఎంఇఒ ధనుంజయ మజ్జి, గ్రంథాలయ అధికారి పూర్ణచంద్ర బెహరా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు, ఒడియా హైస్కూల్ హెచ్ఎం లింగరాజు ప్రసాద్ పట్నాయక్, ఎంపిపి స్కూల్ హెచ్ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆమదాలవలస : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖాగ్రంథాలయంలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో పది హైస్కూళ్ల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి మున్సిపల్ గర్ల్ హైస్కూల్, ద్వితీయ బహుమతి గవర్నమెంట్ హైస్కూల్, గృతీయ బహుమతి లక్ష్మీనగర్ హైస్కూల్ విద్యార్థులు కైవసం చేసుకున్నట్లు గ్రంథాలయ అధికారి అన్నెపు కోటేశ్వరరావు తెలిపారు.

మెళియాపుట్టి : స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, గ్రంథాలయాధికారి వై.అనూరాధ, చాపర జెడ్‌పిహెచ్ స్కూల్ హెచ్ఎం గణపతిరావు, నలంద స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.ప్రతాప్, ప్రభావతి, రాణి, వేణు, సంతోష్, ప్రియాంక పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో ఎంఇఒ చిన్నవాడు, గ్రంథాలయాధికారి రామకృష్ణ, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.రామారావు, భవిత స్కూల్ ఉపాధ్యాయులు భాస్కర్ పాల్గొన్నారు.

నౌపడ: నౌపడ శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి ఆధ్వర్యాన పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పి.వి.అప్పలరాజు, ఉపాధ్యాయులు జయకృష్ణ పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : పుస్తకాన్ని చదువుతున్న చైర్‌పర్సన్ సువర్ణ

పొందూరు : స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో పొందూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌మనోహర్, లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా, విశ్రాంత ఉపాధ్యాయులు కాళ్లకూరి శాంతారాం, గ్రంథాలయ నిర్వాహకులు ఈశ్వరరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో ఎంఇఒ ఎం.త్రినాథరావు, గ్రంథాలయాధికారి పూర్ణచంద్ర బెహరా పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో మాజీ ఎంపిపి చింతాడ మంజు, సుదర్శన, హనుమంతు వినయకుమార్, చింతాడ జీవన్, గ్రంథాలయాధికారి సత్తారు రామారావు, సహాయకులు ఎస్.ఉదయ్‌కిరణ్, ఉమామహేశ్వరరావు, మణికంత, చంద్రకాంత్, దిలీప్ పాల్గొన్నారు.

సోంపేట : బారువ శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో గ్రంథాలయ అధికారి ఎం.ధర్మారావు, ఉపాధ్యాయురాలు హేమలత, సీనియర్ పాటకులు భాస్కరరావు, పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక శాఖాగ్రంథాలయంలో ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉషారాణి ఆధ్వర్యాన విద్యార్థినీ విద్యార్థులతో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి టి.ఇందిర పాల్గొన్నారు.



టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న మంజు



పొందూరు : పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న ప్రిన్సిపాల్ రామ్‌మనోహర్



సోంపేట : పుస్తకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



కొత్తూరు : పుస్తకాలను చదువుతున్న విద్యార్థినులు

డాక్టర్ రమేష్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రోడ్డు ప్రమాదంలో డాక్టర్ మడే రమేష్ మృతి వైద్య రంగానికి తీరని లోటని యుటిఎఫ్ నాయకులు బి.ఓంకార్, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బి.ఆనందరావు అన్నారు. స్థానిక సర్పంచ్ దున్న రత్నం బాలరాజు ఆధ్వర్యాన మంగళవారం స్వగ్రామమైన అమలపాడులో నిర్వహించిన అంత్యక్రియలో వారు పాల్గొన్నారు. వైద్యుని భౌతికకాయాన్ని కడసారి చూడడానికి వచ్చిన వేలాదిమంది ప్రజలే ఆయన సేవలకు నిదర్శనం అన్నారు. వైద్య రంగంలో విశిష్ట సేవలు అందించారని, కరోనా సమయంలో ఆయన సేవలు మరవలేనవని పలువురు బరువెక్కిన హృదయాలతో భావోద్వేగానికి లోనయ్యారు. ఆయనకు, ఆయన కుమారుడు సంకల్పకు సంతాపం ప్రకటిస్తూ కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ఆయన భార్య, కుమార్తె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక (యువివి) సభ్యులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించి సంతాపం ప్రకటించారు. యువివి గౌరవ సలహాదారులు డాక్టర్ తెప్పల ఆనంద్, డాక్టర్ బత్తిని క్రాంతికుమార్, సభ్యులు కె.ప్రకాశరావు ,బి.చిన్నారావు, పోతనపల్లి గీతమ్మ, జినగ సీతారాం, టి.అజయ్ కుమార్, వై.కామేశ్వరరావు, కె.సుధాకర్, గొరకల లోకేశ్వరరావు పాల్గొన్నారు.



అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రజలు

పలాస : పలాస ప్రభుత్వాస్పత్రిలో పనిచేసిన సూపరింటెండెంట్ డాక్టర్ మడే రమేష్ మృతి తీరని లోటని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ అన్నారు. పలాస ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం సంతాపసభ నిర్వహించారు. ముందుగా రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ చిన్నంనాయుడు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి గోతిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని తర్లాకోట సాయిబ్ కాలనీ సమీపంలో ఉన్న నీటి గోతిలో పడి రెంటికోటకు చెందిన శాసనపురి సూర్యనారాయణ (72) మంగళవారం మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... మూడు రోజులుగా కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు గ్రామ పరిసరాలు వెతికినా కనిపించలేదు. ఉదయం కొంత మంది రైతులు అటువైపుగా వెళ్తుండగా... నీటి గోతిలో మృతదేహం తేలి ఉండడాన్ని గమనించి కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీయగా సూర్యనారాయణగా గుర్తించారు. ఈ విషయాన్ని మృతుడు కుటుంబీకులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి గాయాలు

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలోని చింతాడ - సనపలవానిపేటకు మధ్య ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం శ్రీకాకుళం విక్రమ సంస్థలో ఇంటర్వ్యూకు హాజరవుతున్న సీతంపేటకు చెందిన జై.సూర్య, గుమ్మలక్ష్మీపురానికి చెందిన ఊలక లోహిత్ ఇద్దరూ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు.



గుండ దంపతులను సన్మానిస్తున్న బిసి సెల్ నాయకులు

'గుండ' దంపతులకు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం బిసి సెల్ అధ్యక్ష, కార్యదర్శులుగా నియమితులైన ఉంగటి వెంకటరమణ, తంగుడు చంద్రశేఖర్‌లు మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అరసవల్లిలోని వారి స్వగృహంలో కలుసుకుని వారికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి పూర్వ వైభవానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, ఉంగటి వెంకటరావు, ఉంగటి రాజుకృష్ణ, ఉంగటి రాఘవ, ఉంగటి పాపారావు, కునుకు గోవింద్, మెండ గిరీష్‌ప్రతాప్, ఉంగటి రామ్మోహనరావు, చింతు నీలం, గేదెల సురేష్, కొమ్ము అప్పలస్వామి, సీర లక్ష్మీనారాయణ, సీర చిన్నారావు పాల్గొన్నారు.



వంట సామగ్రిని అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

వంట సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని గుప్పిడిపేటలో ఈ నెల 11న సంభవించిన అగ్నిప్రమాదంలో 25 కాలిపోయిన విషయం విదితమే. సముద్రం వేటకు మత్స్యకారులు వెళ్లడం, తిరిగి వచ్చేసరికి అంతా బూడిదయిపోంది. దీంతో తినడానికి తిండి లేక, కట్టుకోవడానికి బట్టలేక దీనాస్థితిలో ఉన్నారు. విషయం తెలుసుకున్న సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి బాధితులకు 18 ఇంటు 15 టార్పాలిన్లు, చాపలు, రెండేసి గ్లాసులు, రెండే వంట పాత్రలు, గరిటె, కంచాలు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వరప్రసాద్, మధు, రమేష్, రాజారావు, శ్రీధర్, చంద్రశేఖర్, జగదీష్, కె.నాగరాజు, శ్రీనివాసరావు, ఈశ్వరరావు, పైడితాత, లబ్బ ధనలక్ష్మి, పైడమ్మ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని నారువలో గ్రామ సచివాలయం, రైతు బరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలను మంగళవారం ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలతో సచివాయలం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలను నిర్మించామని అన్నారు. ఇందులో 12 మంది గ్రామ సచివాలయ ఉద్యోగస్తులను, 50 ఇళ్లకు ఒక వాలంటీర్‌ని ఏర్పాటు చేసి పేదలు అభ్యున్నతికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, మండల అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, నారువ, మెంటాడ సర్పంచ్‌లు కాటకుని దేవి, బాకి లక్ష్మి, మండల స్పెషల్ ఆఫీసర్ దుర్గారావు, పంచాయతీరాజ్ డిఇ సీతంనాయుడు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ధనుంజయరావు, పంచాయతీరాజ్ ఎఇ కూర్మనాథం, ఎఇ విజయభాస్కరరావు, హౌసింగ్ ఎఇ మోహనరావు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రామారావుని పరామర్శ

మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీలో టిడిపి మండల ఉపాధ్యక్షులు డాక్టర్ దురగాసి రామారావుకు ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స నిర్వహించుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, జె.ఆర్.పురం1 ఎంపిటిసి పచ్చిగుళ్ల సాయిరాం, రణస లం మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్ టేకి బ్రహ్మాజీ, నాయకులు కంబపు నర్సింహులురెడ్డి, కోల అప్పడ దొర, పెద్ది శ్రీను, బోనం గురుమూర్తి ఉన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో శర్వాణి విద్యార్థుల సత్తా



ట్రోఫీని అందుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని అరసవల్లి రోడ్‌లో ఉన్న శర్వాణి విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైయిర్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. వైజాగ్‌లో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ బహుమతి సాధించి, అత్యున్నత ప్రతిభను కనబర్చిన 8వ తరగతి విద్యార్థులు డబ్ల్యూ.వి.ఎస్.నవీన్ మణికంఠ, టి.సూర్యతేజారెడ్డిలు విజేతలుగా నిలిచారు. వారిని శర్వాణి విద్యా సంస్థల అధినేత అంధవరపు సూరిబాబు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం ఉపాధ్యాయుల పర్యవేక్షణ, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ బహుమతి సాధించారని అన్నారు. ప్రతి విద్యార్థీ తనకంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ఆ లక్ష్య సాధనకు పనిచేయాలన్నారు. అప్పుడే ఎన్నో అద్భుత విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులకు రూ.5 వేలు నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు.

జనసేన నాయకుల నిరసన

ప్రజాశక్తి- ఆమదాలవలస

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అందించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని జగ్గు శాస్త్రులపేట వద్ద నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను కార్యకర్తలతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ప్రస్తుత వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలతో లబ్ధిదారులకు గృహాలను అందజేయడానికి నిరాకరిస్తున్నదని విమర్శించారు. పేదల సొంతింటి కలలపై వైసిపి ప్రభుత్వం నీళ్లు చల్లిందన్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు కళ్లు తెరిచి నిరుపయోగంగా ఉన్న టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసి వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

విప్లవ వీరుడు 'బిర్సా ముండా'

ప్రజాశక్తి- మందస

మండలంలోని బవనపురంలో మన్యం విప్లవ వీరుడు బిర్సా ముండా 147వ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ధర్మారావు మాట్లాడుతూ అడవులు, అటవీ భూములను, విశాల ప్రాంతాలను, కొండలను కార్పొరేటర్లకు, బహులజాతి సంస్థలకు ధారాదత్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతుందన్నారు. దీనివల్ల గిరిజనులు తమ హక్కులను కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 52 జిఒ తీసుకొచ్చి వాల్మీకి, బోయ, బెంతుఒరియా, మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చే ప్రయత్నం చేస్తుందన్నారు. దీనివల్ల ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర తరగతులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని జెసి శర్మ కమిషన్ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వం తీసుకొచ్చిన 52 జిఒను, కార్పొరేట్ అనుకూల సంరక్షణ నియమాలు-2022 పత్రాలను దహనం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కోశాధికారి గురునాథ్, మండల సభ్యులు యజాక భాస్కరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి మట్ట ధర్మారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి : ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు



మందస : ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ సియాలి పంచాయతీ బుచ్చిగుడ, సుంకన్నపేటలో ఆలిండియా కిసాన్ మజ్దూర్ సభ ఆధ్వర్యాన బిర్సా ముండా జయంతిని నిర్వహించారు. అటవీ భూములను కార్పరేట్లకు ధారాదత్తం చేసే అటవీ చట్టం-22ను వ్యతిరేకిస్తూ దానికి సబందించిన పత్రాలను దహనం చేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రొక్కం లోకనాథం, ఎఐకెఎస్ జిల్లా కార్యదర్శి కేదార్ సబర్, జోనేష్ మెథి, శుంక సబర్, లిమ్మల రాం పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

నందిగాం : రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని పెద్దతామరపల్లిలో తెంబూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు అధ్యక్షతన సహకార సంఘాల ద్వారా రైతులకు అందించే రుణాలు, పథకాలపై మంగళవారం చైతన్య సదస్సు నిర్వహించారు. సర్పంచ్ తమిరి దేవేంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సహకార సంఘాల బలోపతానికి, రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టెక్కలి సహకారశాఖ బ్యాంకు మేనేజర్ ఇప్పిలి సీతారాం, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి సైలాడ లావన్న, లవుని పల్లి ధనరాజ్, కర్లపూడి సర్పంచ్ తమిరిరాజు, పిఎసిఎస్ డైరెక్టర్ కృష్ణారావు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సిబ్బంది పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని ఎంపిపి అన్నారు. మండలంలోని పెద్దతామరపల్లి సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. లబ్ధిదారులకు ఎక్కడ ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. ఈయన వెంట పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, స్థానిక సర్పంచ్ తమిరి దేవేంద్రరావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి సభ్యులు లావన్న, కార్యదర్శి చంద్రశేఖరరావు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

ఒటిఎస్ పత్రాల అందజేత

జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని ఎంపిపి అన్నారు. నందిగాం సచివాలయంలో ఒటిఎస్ పథకం ద్వారా డబ్బులు చెల్లించిన లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి జడ్యాడ జయరాం, వైసిపి నాయకులు అక్కురాడ లోకనాథం, కార్యదర్శి పాల్గొన్నారు.



సందడిగా వన భోజనం

పొందూరు: కార్తీకమాసం పురస్కరించుకుని పొందూరు ఆంధ్రాఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం (ఎఎఫ్‌కెకె) ఆధ్వర్యాన స్థానిక మాడుగుల తోటలో వనభోజన మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో పలు గ్రామాలకు చెందిన ఖాదీ నేత, వడుకు కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎఎఫ్‌కెకె సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కామేశ్వర ప్రసాద్, వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిపై ఇంత నిర్లక్ష్యమా!

మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ

మెళియాపుట్టి : అభివృద్ధి పనులపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యం వహించడం సరికాదని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. మండలంలోని పదనాపు రం గ్రామ రహదారిని మంగళవారం పరిశీలించా రు. గ్రామానికి వెళ్లే రహదారి రాళ్లు తేలి అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశానని, మూడేళ్లు గడిచిన రోడ్డు అభివృద్ధి చేపట్టకపోవడం ఏమిటని ప్రభుత్వానికి ప్రశ్నించారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈయన వెంట బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పైల లక్ష్మయ్య, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూరెల లలితకుమారి, ఎంపిటిసి ప్రతినిధి కదంబల పైడిరాజు, కోదండరావు, వసంతరావు, పరమేష్‌రెడ్డి, వల్లభరావు, శశిభూషణ్ పాల్గొన్నారు.

పలువురిని పరామర్శ

మండలంలోని పలు గ్రామాల్లో పలు కుటుంబాలను పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మంగళవారం పరామర్శించారు. కొత్తమారేడుకోటకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు ధనుంజయ అనారోగ్యానికి గురికావడంతో ఆయనను, అదే గ్రామానికి చెందిన తమిరి సాయమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను, జాడుపల్లికి చెందిన పెద్దింటి సోమేశ్వరరావు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పెద్దలక్ష్మీపురానికి చెందిన మడపాల గణపతి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఊర్లోన వసంత్, జాడుపల్లి ఎంపిటిసి ప్రతినిధి కతంబాల పైడిరాజు, మాజీ ఉప సర్పంచ్ బిర్లంగి ఢిల్లీరావు, వైకుంఠరావు తదితరులు ఉన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ


మాట్లాడుతున్న ఎంఇఒ త్రినాథరావు

కృత్యాధార బోధనపై శిక్షణ

ప్రజాశక్తి- రణస్థలం

ఉపాధ్యాయులు శిక్షణ పొంది ఆ శిక్షణల ద్వారా విద్యార్థులకు మెరుగైన బోధన చేయాలని ఎంఇఒ ఎ.త్రినాథరావు అన్నారు. యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఇండియా లిటరసీ ప్రాజెక్టు సహకారంతో స్కూల్ రెడీనెస్ అండ్ బాలవికాస్ ప్రోగ్రాంలో భాగంగా మండల విద్యా వనరుల కేంద్రంలో ఉపాధ్యాయులకు కృత్యాధార బోధనపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. రణస్థలం, లావేరు మండలాల 35 ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులకు చీపురుపల్లి శోధన ట్రస్టు రిసోర్స్ పర్సన్స్ శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజూ పాఠశాలకు పిల్లలు వచ్చే విధంగా సంసిద్ధత చేయడం, పిల్లలను వివిధ వృత్తిల్లో రాణించే విధంగా ఉపాధ్యాయులు ప్రయత్నం చేయాలన్నారు. సంస్థ ట్రెజరీ జి.అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ కృత్యాదార బోధనను చక్కగా నేర్చుకోని మన పాఠశాలలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్ ఎం.సత్యం, జి.అరుణ, ఎం.ఎల్.నాయుడు, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పి.మాధవి, ప్రాజెక్టు లెర్నింగ్ కో-ఆర్డినేటర్ టి.కరుణాకర్, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ అదప రమణమూర్తి, ఆర్.కల్పన, ఎస్.నాయుడు, వి.వి.సత్యవతి, జి.హేమసుందర్ పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న ఎపిఎం ప్రసాదరావు

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య విద్యార్థులకు అందుతుందని, అందుకు విద్యను బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మండల విద్యా సంక్షేమ అధికారి, వెలుగు ఎపిఎం ప్రసాదరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాలు, విద్యాశాఖ సిబ్బందితో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనబడి నాడు-నేడు కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. ఈ పథకంలో తల్లిదండ్రుల కమిటీ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, పాఠశాలల విద్య సంబంధించి అకాడమిక్, నాన్ అకాడమిక్ అంశాలపై తగిన దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ కె.అప్పారావు, సిఆర్‌పిలు, సిసిలు పాల్గొన్నారు.

డిసిఆర్‌బి సిఐగా ప్రసాద్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా పోలీసుశాఖలో నేర రికార్డు బ్యూరో (డిసిఆర్‌బి) ఇన్‌స్పెక్టర్‌గా బి.ప్రసాదరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వన్‌టౌన్ ఎస్‌ఐగాను, ఆమదాలవలస సిఐగా పనిచేసిన ప్రసాదరావును ఇటీవల నిర్వహించిన బదిలీల్లో డిసిఆర్‌బికి నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఆయన ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్.రాధికను మర్యాదపూర్వకంగా కలిశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


పలాస : పర్యటిస్తున్న మంత్రి అప్పలరాజు

పలాస : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత పార్టీలకతతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 11వ వార్డు పరిధిలోని పూజారివీధి, చిన్నబ్రహ్మిణవీధి, పెద్దబ్రహ్మిణవీధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక కారణాలు వల్ల ఏదైనా సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. త్వరలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం 11వ వార్డు సచివాలయాన్ని సందర్శించారు. ఉద్యోగుల పనితీరుపై ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దుర్గా శంకర్‌పండా, పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బోర బుజ్జి, ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్ కుమార్, కమిషనర్ రాజగోపాల్, తహశీల్దార్ మధుసూదనరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ పాల్గొన్నారు.


టెక్కలి రూరల్ : పోస్టర్‌ను అందజేస్తున్న శ్రీనివాస్

కంచిలి : ప్రతి ఒకరీ సంతోషమే వైసిపి ప్రభుత్వం ధ్యేయమని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని కొక్కిలిపుట్టుగా పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, స్వచ్ఛ భారత్ డైరెక్టర్ కృష్ణ రౌలో, లడ్డు కేశవ పాత్రో, పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మిడి రాందాస్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. టెక్కలి మెయిన్ రోడ్డు అక్కపువీధుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్‌ను ఇంటింటికీ అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, వైస్ ఎంపిపి రమేష్, మన్నెల కిషోర్, చంటి, నాగళ్ల శంకర్, జి.సుజాత, గండి విశ్వశాంతిరెడ్డి, వాకాడ శ్రీధర్, దివ్వెల మాధురి, బగాది హరి పాల్గొన్నారు.

'గడప గడప'లో పలు సమస్యలు

ఆమదాలవలస : సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ బగాన సుజాత శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను కోరారు. పురపాలక సంఘ పరిధిలోని 15వ వార్డు పాతినవారివీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె కోరారు. సుజాత తన కుమారుడు ఇంజినీరింగ్ చదువుతున్నాడని, విద్యాదీవెన మంజూరు కాలేదని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పీకర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అర్హత ఉన్నా తన భర్తకు పింఛను నిలిపివేశారని పెద్ది మాలతి అనే మహిళ స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇల్లు స్క్వేర్ ఫీట్లు ఎక్కువగా ఉండటంతో పింఛను నిలిచిపోయిందని సచివాలయ సిబ్బంది స్పీకర్‌కు తెలిపారు. తనకూ అర్హత ఉన్నా పింఛను మంజూరు చేయలేదని, ఇదెక్కడి న్యాయమని పొట్నూరు శ్రీరామ్మూర్తి స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలను మంజూరు చేశామని, త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని స్పీకర్ మహిళలకు సూచించగా, ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి తమకు ఇవ్వాలని తాము నిర్మించలేమని వారు స్పీకర్‌కు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, ఎఎ కె.అప్పలనాయుడు, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పొడుగు శ్రీనివాసరావు, అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, బోర చిన్నంనాయుడు, బద్రి రామారావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


స్పీకర్‌తో మాట్లాడుతున్న సుజాత

కృష్ణకు ఘన నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఎన్నో ప్రయోగాలకు ఆద్యుడు, ప్రేక్షకుల మనసులో చెరగని ముద్ర వేసుకున్న ఘట్టమనేని శివరామకృష్ణ మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటని పలువురు కొనియాడారు. ఆయన మృతి చెందారన్న సమాచారాన్ని తెలుసుకున్న అభిమానులు పెద్దసంఖ్యలో నగరంలోని సూర్యమహల్ వద్దకు తరలివచ్చారు. ఆయన మృతికి సంతాప సూచికంగా కృష్ణ చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మహేష్‌బాబు సేవ సమితి జిల్లా అధ్యక్షులు ఉంకిలి శ్రీను, ఫాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బసవ రాజేష్‌రెడ్డి, జగన్, భద్రరావు, గుప్త, సాయిప్రసాద్, బలరాం, తేజ, సతీష్ రెడ్డి, సిరపయ్య, గౌరీ శంకర్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక బస్టాండ్ వద్ద నిర్వహించిన కృష్ణ సంతాపసభలో మణికంఠ, కళ్లేపల్లి శ్రీనివాసరావు, వెంకటరావు పాల్గొన్నారు. ముందుగా కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

టెక్కలి : కృష్ణ మృతికి స్థానిక సుదర్శన థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ బాలకృష్ణ, అద్దాల నాగరాజు పాల్గొన్నారు.

కృష్ణ మృతి బాధాకరం

కోటబొమ్మాళి: సూపర్‌స్టార్ కృష్ణ మృతి బాధాకరమని, కళామ్మతల్లి తన ముద్దు బిడ్డను కోల్పోయిందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడలో తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కృష్ణ నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, నిర్మాణసంస్థ అధినేతగా తెలుగు సినిమా రంగానికి ఐదు దశాబ్ధాల పాటు సినీరంగంలో తనదైన ముద్రవేశారన్నారు. కృష్ణ మూర్తి తెలుగు సినీ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే జిల్లాలోని పలువురు నాయకులు వచ్చిన ఆయా మండలాల్లోని సమస్యలను అచ్చెన్న దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, హిరమండలం జెడ్‌పిటిసి బుచ్చిబాబు, టెక్కలి మండలం నౌపడ, మూలపేట, నందిగాం, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న అభిమానులు


పరిశీలిస్తున్న తిరుమల చైతన్య

తాడివలస పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం డిప్యూటీ డిఇఒ డాక్టర్ తిరుమల చైతన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలతో పాటు విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలు పైడి సునీత ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జుడో శిక్షణను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి దాతలు, ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. ఈయనతో పాటు డైట్ లెక్చరర్ వై.వెంకట అప్పలనాయుడు, ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని పాలతలగం పంచాయతీ ఉదండపాలెంలో సర్పంచ్ నక్కిట్ల అప్పన్న ఆధ్వర్యాన నూతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్, విద్యుత్ తీగలను విద్యుత్ శాఖ ఎఇ ఎం.శివకుమార్ మంగళవారం ఏర్పాటు చేశారు. కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి అట్టాడ అప్పలనాయుడు, వైసిపి నాయకులు నక్కిట్ల నరేష్, కార్యదర్శి కె.రాజేంద్రప్రసాద్, లైన్‌మేన్ పాల్గొన్నారు.

యోగాలో జీవిత ప్రతిభ

ప్రజాశక్తి- పొందూరు

అనకాపల్లి జిల్లా చోడవరంలో ఈ నెల 12,13వ తేదీల్లో ఉషోదయ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో 20-30 సంవత్సరాల విభాగంలో మండలంలోని తోలాపికి చెందిన గురుగుబెల్లి జీవిత ప్రథమ స్థానం సాధించింది. ఈ పోటీల్లో మొత్తం 13 జిల్లాల నుంచి 400 మంది పాల్గొనగా, వయసుల వారీగా ఏడు గ్రూపులుగా విభజించారు. ఈమె ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చేతులు మీదుగా బహుమతిని అందుకున్నారు. ఈమె ప్రస్తుతం రాగోలు జెమ్స్ మెడికల్ కాలేజీలో యోగా టీచర్‌గా పనిచేస్తున్నారు. యోగా పోటీల్లో ప్రతిభను కనబర్చిన ఈమెకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.


పనులను పరిశీలిస్తున్న ఎంపిపి దేవదాస్‌రెడ్డి

'నాడు-నేడు' పనుల పరిశీలన

కంచిలి : ండలంలోని జాడపూడి కస్తూరిబా పాఠశాలలో చేపడుతున్న నాడు-నేడు పనులను ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ ప్రతినిధి పలికల జయరాం మంగళవారం పరిశీలించారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులు సిబ్బంది హాజరను, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


పౌష్టికాహారం అందజేస్తున్న నాయకులు

పౌష్టికాహారం పంపిణీ

కోటబొమ్మాళి: అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని చీపుర్లపాడు సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు, ఎంపిటిసి బొడ్డు అప్పన్నలు అన్నారు. ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు మంగళవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. సరుకుల పంపిణీలో అక్రమాలు చోటు చేసుకుంటే చర్యలకు సిఫార్సులు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం వల్ల పిల్లలు ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభం

కంచిలి : మండలంలోని చిన్నకొజ్జిరియా పంచాయతీ చంద్రపుట్టుగలో మంగళవారం టిడిపి మండల కార్యదర్శి మాదిన రామారావు ఆధ్వర్యాన బోరు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ నిధులు రూ.1.50 లక్షలతో బోరు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భీమారావు, కేశవ, పద్మనాభం పాల్గొన్నారు.

సంతబొమ్మాళిలో పారిశుధ్య పనులు

సంతబొమ్మాళి: పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా సంతబొమ్మాళి గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం, నగిరిపెంట, శివరాంపురంలో సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి ఆధ్వర్యాన మంగళవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామంలోని కాలువలపై ఉన్న కప్పలను తొలగించి చెత్తా చెదారాలను తొలగించి దూరంగా పారవేయించారు. అనంతరం బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కళింగపట్నం అప్పారావు, వాలంటీర్లు పాల్గొన్నారు.


పూడికతీత పనులను పరిశీలిస్తున్న అప్పారావు

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఈనెల 21, 22 తేదీల్లో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో నిర్వహిస్తున్న కౌలు రైతుల సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు పిలుపునిచ్చారు. వజ్రపుకొత్తూరు బస్టాండ్ వద్ద మహాసభల పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు రక్షణ కల్పిస్తామని చెప్పే పాలకులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో, నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు చెల్లించి, పెట్టుబడి పెట్టిన పంటలు చేతికి వచ్చే సమయానికి చీడ పీడలు, ప్రకృతి వైపరీత్యాలకు గురై నష్టపోతున్నాయని తెలిపారు. దీంతో కౌలు రైతు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతులకు రక్షణ కల్పించే విధంగా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. మహాసభల్లో పలు అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సంఘ జిల్లా నాయకులు బమ్మిడి ఆనందరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అవసరం

ప్రజాశక్తి- టెక్కలి

సమాజంలో ప్రజలకు వినియోగంలోకి వచ్చే సౌకర్యాలు కల్పనలో సామాజిక చింతన కూడిన సేవాదృక్పథం అవసరమని పాతనౌపడా సర్పంచ్ దల్లి లోకేష్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని కళావేదిక భవన పున:నిర్మాణం ప్రారంభోత్సవాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధికి ప్రజా భాగస్వామ్యం అవసరమన్నారు. పాఠశాల ఆవరణలోని కళావేదిక నిర్మాణానికి సహకరించిన పూర్వ విద్యార్థి రోణంకి విజయ్‌కుమార్ రూ.50 వేలు, దేవిశ్రీఫుడ్ రూ.1.50 లక్షలు విరాళంతో కళావేదిక నిర్మించామని ప్రధానోపాధ్యాయులు ధర్మారావు తెలిపారు. ఈ వేదిక ప్రారంభం దృష్టా పాఠశాల అవసరాలకు వినియోగించుకోనున్నామని తెలిపారు. కార్యక్రమంలో బిగ్‌హెల్ప్ డైరెక్టర్ రామమునిరమేష్‌కుమార్, చైర్మన్ ఎన్.కృష్ణారావు, జోనల్ డైరెక్టర్ ఎల్.జయకృష్ణారెడ్డి, ఎంపిటిసి అప్పలరాజు, రాజేశ్వరరెడ్డి, చిలుకు కృష్ణారావు, తులసిరెడ్డి పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న సర్పంచ్ లోకేష్‌రెడ్డి

జంగిల్స్‌తో అవస్థలు

జి.సిగడాం : మండలంలోని సేతు భీమవరం పంచాయతీకు వెళ్లాలంటే చాలా మలుపులతో కూడిన రహదారి. అయితే మలుపులుతో పాటు రోడ్డుకి ఇరువైపులా పొదలు మొక్కలు, దట్టమైన చెట్లు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులను పడుతున్నారు. మలుపులు వద్ద దట్టంగా పెరిగిన మొక్కలు వల్ల ఎదురుగా వచ్చిన వాహనదారులు కనిపించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకి ఇరువైపులా ఉన్న దట్టమైన మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.


పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

బీమా సాయం అందజేత

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి పంచాయతీ పరిధిలోని కరణాలవీధికి చెందిన సుడిగాం శేఖర్‌పట్నాయక్ ఇటీవల అనారోగ్యం మృతి చెందారు. ఆయన కుటుంబానికి వైఎస్‌ఆర్ బీమా పథకం వర్తించడంతో తక్షణ సాయం కింద రూ.పది వేలును సర్పంచ్ కాళ్ల సంజీవరావు మంగళవారం అందజేశారు. ఆ కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచ్ హామీఇచ్చారు. ఆయనతో పాటు ఎంపిటిసి కమ్మకట్టు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి రఘుపాత్రుని యోగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు డబ్బీరు ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

భూ సర్వే ప్రారంభం

కోటబొమ్మాళి: ప్రభుత్వం నిర్వహిస్తున్న భూసర్వేను పంచాయతీ ప్రజలు అధికారులకు సహకరించాలని చీపుర్లపాడు ఎంపిటిసి బొడ్డు అప్పన్న అన్నారు. వైసిపి నాయకుడు నేతింటి అప్పలస్వామితో కలిసి జగనన్న భూ రీ సర్వేను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సర్వేలో భూ యజమానులకు సమస్యలు ఉంటే పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. అనంతరం చీపుర్లపాడు ప్రభుత్వం పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెను ప్రకారం భోజనం వండిపెడుతున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, వైసిపి నాయకులు నెయ్యిల సురేష్ పాల్గొన్నారు.


భూ సర్వేను ప్రారంభిస్తున్న అప్పన్న

బాలల హక్కులపై అవగాహనా ర్యాలీ


పొందూరు : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పొందూరు: బెజ్జిపురం యూత్‌క్లబ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన అమలవుతున్న చైల్డ్‌లైన్ కొలాబ్ ప్రాజెక్టు పట్టణంలో మంగళవారం చైల్డ్‌లైన్ సే దోస్తీ, బాలల హక్కులు, పరిరక్షణపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్‌లైన్ కోలాబ్ కో-ఆర్డినేటర్ హేమలత బాలల హక్కులు, సమస్యలు, చట్టాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.రామమనోహర్, ఎస్ఐ లక్ష్మణరావు, ఎఎస్ఐ సువ్వారి రామచంద్రరావు, చైల్డ్‌లైన్ కౌన్సిలర్ యు.మెహెర్వాణి, సిబ్బంది డి.రాజు, వై.శంకర్, పి.దుర్గారావు, బాలవికాస్ ప్రాజెక్టు సిబ్బంది కె.శ్రావణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : చైల్డ్ లైన్ సే దోస్తీ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక సబ్ సెంటర్ ఆధ్వర్యాన రైడ్ ఫర్ సేఫ్ చైల్డ్ హుడ్ అనే అంశంపై బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ గోవిందరావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ జాస్మిన్‌కుమారి, యమాని, నందిని, ఉషారాణి, సింహాచలం, గగన్, దివ్యమణి పాల్గొన్నారు. బాల్య వివాహాలు వద్దు... బాలలను చదివిద్దామని నినాదాలు చేశారు.

మహిళలకు భద్రత కల్పించడం మన బాధ్యత

పలాస : మహిళలపై లైంగిక దాడులు జరగకుండా భద్రత కల్పించడం మనందరి బాధ్యతని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వైకుంఠరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో చైల్డ్‌లైన్ సే దోస్తీ వారోత్సవాల్లో భాగంగా రైడ్ ఫర్ సేఫ్ చైల్డ్ హుడ్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ పలాస ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కె.శివాజీ, చైల్డ్‌లైన్ టీం మెబరు డి.రమణ, డి.జగదీశ్వరీ, కె.సునీత, ఉపాధ్యాయులు ఎం.యాస్మిన్ బేగం, వెల్ఫేర్ అసిస్టెంట్ కె.చాణిక్య పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఐ గోవిందరావు

రక్తదాన శిబిరానికి స్పందన


ప్రశంసాపత్రం అందజేస్తున్న వైద్యాధికారి రాజేష్

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని మెట్టూరులో భగత్ సింగ్ ట్రస్టు ఆధ్వర్యాన రాగోలు జెమ్స్ ఆస్పత్రి సహకారంతో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 70 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కొల్ల రాజేష్ మాట్లాడుతూ యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం మరొకరికి ప్రాణదానమని అన్నారు. అనంతరం ప్రశంసాపత్రాలను అందజేశారు. రక్తదానంపై అపోహలు వద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు, ట్రస్టు సభ్యులు బి.లోకేష్ పాల్గొన్నారు.

ఓండ్రుజోలలో గ్రామసభ

కొత్తూరు: మండలంలోని ఓండ్రుజోలలో ఉపాధి హామీ 2023-24కు సంబంధించి పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ ప్రతినిధి నాగేంద్ర అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో రూ.60 లక్షలతో పనులను గుర్తించారు. ఇందులో రైతులకు సంబంధించి 15 పనులు, ట్యాంకులు 9, కెనాల్ పనులు ఐదు గుర్తించినట్లు ఎపిఒ ప్రేమలత తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి జి.ఢిల్లీశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్ కామేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు అశోక్, కూలీలు పాల్గొన్నారు.

20న మహా రుద్రాభిషేకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 20న నిర్వహించనున్న మహారుద్రాభిషేకానికి యాత్రికులు తరలిరావాలని వైద్య నిపుణులు దానేటి శ్రీధర్ పిలుపునిచ్చారు. నగరంలోని హోటల్ గ్రాండ్‌లో రుద్రాభిషేకం పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరుకు చెందిన జ్ఞాన ప్రసూన స్వామి, రాజేష్ నాథ్ మహారాజ్ అఘోరా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో దుప్పల వెంకటరావు, పొగిరి సుగుణకర్, జయరాం, డాక్టర్ గీతాశ్రీకాంత్, నటకుల మోహన్, మణికంఠ, గుడ్ల దామోదర్ పాల్గొన్నారు.


పోస్టరును ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీధర్


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వృద్ధాశ్రమం ప్రారంభం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని మెట్టూరు బిట్-3లో ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధాశ్రమలోని పేద వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన అనురాగ నిలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వృద్ధులను ఆదుకోవాలనే ఆలోచన ఏర్పాటు చేసిన నిర్వాహకులు గంగరాపు హరిష్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోయిలాపు శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, నాయకులు గోగుల వరప్రసాదరావు, బర్రి శ్రీను పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని బెల్లుపడాలో నీలపువీధిలో ఉన్న బాధిత కుటుంబానికి హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ సభ్యులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. ఒడిశా రాష్ట్రం నుంచి ఇచ్ఛాపురానికి జీవనోపాధి కోసం వచ్చిన నిరుపేద రీనానాయక్ కుటుంబానికి హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ సన్యాసిపుట్టుగ, సేవా సంస్థ రూ.15 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సావాడ గణేష్ రెడ్డి, నీలాపు చిరంజీవి, మసూపత్రి నీలాద్రి, పనపాన కృష్ణ, నీలాపు యకంబర్, పిట్ట నరేంద్ర, గుజ్జు సాయి, పిట్ట భాస్కర్, మసూపత్రి గణేష్, నీలాపు మోహన్ పాల్గొన్నారు.